క్లుప్తంగా

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతోపాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధి దీపాలు కలిప్తామని ఇచ్చిన వాగ్దానాలకు తిలోదకాలిచ్చారన్నారు. దశాబ్దాల తరబడి పేదల సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ , సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య హాజరవుతారన్నారు.

గోపీబాబుకు ధార్మిక డాక్టరేట్



గోపిబాబు

కడప కల్చరల్: ఆధ్యాత్మిక రంగంలో విశేష సేవలందించినందుకు ధర్మ ప్రచార పరిషత్ కడప శాఖ ప్రోగ్రాం అసిస్టెంట్ తిరునామలై గోపీబాబుకు ధార్మిక డాక్టరేట్ దక్కింది. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో ఆదివారం కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఆలూరివిల్సన్, డాక్టర్ ఎస్.ఇంద్ర పలువురు అతిథులతో కలిసి డాక్టరేట్‌తోపాటు బంగారు పతకం, ప్రశంసా ధృవ పత్రం అందుకున్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రచారాన్ని నిర్వహిస్తున్నందుకు ఆయనకు ఈ అవార్డు అందజేశారని గోపీబాబు తెలిపారు.

1వతేదీ నుంచి రాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం

కడప కల్చరల్: కడప మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. ఇందులో భాగంగా 1వతేదీ ఉదయం నాలుగు గంటలకు అభిషేకం, అర్చన ఉంటాయన్నారు. 2న ఉదయం 4 గంటల నుంచి విశేష పూజలు, సాయంత్రం 6 గంటలకు ముత్తయిదువులచే మాంగల్య పూజ నిర్వహిస్తామన్నారు. రాత్రి భక్తి సంగీత విభావరి ఉంటుందని, 3న ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరిస్తున్న సీఐ నాగార్జున

కడప వైఎస్సార్ సర్కిల్: ఆప్ కి ఆవాజ్ ఆధ్వర్యంలో నగరంలోని అల్మాస్‌పేట్ సర్కిల్‌లో సయ్యద్‌నజీర్ అహ్మద్ రచించిన పుస్తకాన్ని కడప టూటౌన్ సీఐ నాగార్జున, తదితరులు అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ అవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ చాన్ భాష, నాయకులు అప్సర్ ఖాన్ నిజాముద్దీన్ డాక్టర్ నిజాముద్దీన్ డాక్టర్ అబిద్ సికిందర్ హుస్సేన్ ఎజాజ్ హర్షత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్, యూపీఎస్ కన్నా ఓపీఎస్సే మిన్న

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగులకు నూతనంగా ప్రవేశపెడుతున్న యూపీఎస్ పింఛను పథకం కంటే ఓపీఎస్(పాత పింఛను పథకం) మేలు అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఉద్యోగులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి యూపీఎస్ పథకంలో చేరే అవకాశం ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రవేశ పెట్టదలచిన యూపీఎస్ పథకంలో చాలా లోపాలున్నాయని, పదవీ విరమణ తర్వాత ఉద్యోగి తీవ్రంగా నష్టపోతాడని చెప్పారు. ఉద్యోగులకు గ్రాట్యుటీ రాదని, హెల్త్ కార్డులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చెల్లవని, 25 సంవత్సరాల గరిష్ట సర్వీసుకు మాత్రమే పింఛను ఇస్తారన్నారు. 8.5 శాతం కార్పస్ నిధిని కూడా పదవీ విరమణ తర్వాత ఉద్యోగి ఖాతాలోకే వేయాలని ఆయన సూచించారు.

స్టాఫ్ నర్సుకు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న సుప్రజ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా వైద్య సేవలందించిన అబ్బరాజు సుప్రజకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పలువురు ఆమెను అభినందించారు.

యోధుల ఫలం గణతంత్ర దినం

ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, విధులు వినియోగించుకోవాలని, ఎందరో యోధుల త్యాగాల ఫలమే రాజ్యాంగ దినం అని వక్తలు పలు చోట్ల పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాల్లో జెండా వందనం చేసి స్వేచ్ఛా భారతికి జేజేలు పలికారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడాయి. వివిధ వేషధారణ, ఆటా, పాటలతో ఉత్సాహంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎగిరిన మువ్వన్నెల జెండా
- పాఠశాలల్లో అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తములకు ప్రశంసాపత్రాల పంపిణీ



పోలీస్ పరేడ్‌లో జెండా ఎగురవేస్తూ నృత్యం చేస్తున్న బాలికలు



పోలీస్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, పాల్గొన్న పోలీస్ అధికారులు




జిల్లా కోర్టులో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, పాల్గొన్న న్యాయమూర్తులు



ఆర్టీసీ ఉద్యోగికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఈడీ పైడి చంద్రశేఖర్, పాల్గొన్న అధికారులు



అంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జాతీయ జెండా వందనం చేస్తున్న ఏపీజీబీచైర్మన్ సత్యప్రకాష్ సింగ్



రైల్వే స్టేషన్‌లో గణతంత్ర దినోత్స వేడుకల్లో మేనేజర్ శేఖర్ కుమార్, పాల్గొన్న రైల్వే సిబ్బంది



కేంద్ర కారాగారంలో జెండా వందనం చేస్తున్న రాజేశ్వరరావు

కడప నగరంలో గణతంత్ర ఉత్సవాలు ఘనంగా సాగాయి. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గణతంత్ర వేడుక ఘనంగా నిర్వహించారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సురేష్‌బాబు, నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం, అధికారులు పాల్గొన్నారు.

- పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ శ్యాముల్, డీఈఓ కార్యాలయంలో డీఈఓ డాక్టర్ షంషుద్దీన్, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గంగిరెడ్డి, మను పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు.
- కేవీకే, ఏరువాక సమన్వయకర్తలు డాక్టర్ వీరయ్య, అంకయ్య కుమార్, శాస్త్రవేత్తలు, కడప వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయంలో ఏడీ శంకర్‌నాయక్ జెండా ఆవిష్కరించారు.
- నెహ్రూయువజన కేంద్రంలో జిల్లా యువజన అధికారి మణికంఠ, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సలీంబాషా, కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కందుల సంస్థ అధినేత చంద్ర ఓబుల్‌రెడ్డి, పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపల్ మునేష్ మీనా, అంధుల పాఠశాలలో హెచ్‌ఎం ఎబినేజర్‌లు జెండాను ఎగురవేసి వేడుక నిర్వహించారు.
- సాయిబాబా హైస్కూల్, పవన్ ఇంగ్లీస్ మీడియ స్కూల్, నాగార్జున మోడల్ స్కూల్, శాంతినికేతన్ స్కూల్, నాగార్జున స్కూల్, గురుకుల విద్యాపీ ఠ్ స్కూల్లో, దిన్నెపాటి కోచింగ్ సెంటర్‌లలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు.
- సీపీ.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కృష్ణారెడ్డి జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ గణతంత్ర వేడుకల సందర్భంగా అన్ని సంస్థల్లో ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని, అప్పుడే దేశాభివృద్ధి జరుగు తుందని వివరించారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి కూడా మాట్లాడారు.
- కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జాతీయ జెండా ఎగరవేసి గౌరవ వందనం చేశారు.గీ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్‌తోపాటు, ఇతర అధికారులు పాల్గొన్నారు.
- కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ జాతీయ జెండా ఎగురవేశారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
- జీవిత బీమా సంస్థ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డీవీఎం జీకే.రవికుమార్ జెండా ఆవిష్కరించారు. హిందీ భాషా ప్రచారకులు కేఎస్.ఫర్హతుల్లాను ఘనంగా సత్కరించారు. శ్యాంసుందర్‌రావు, సత్యప్రసాద్, సత్యశ్రీనివాస్, పాల్గొన్నారు.
- జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ మువ్వన్నెల జెండా ఎగురవేశారు.
- విజయ ఫౌండేషన్ ఆర్తిహోం పాఠశాలలో చైర్మన్ పుచ్చలపల్లి సంధ్య, కార్యదర్శి బోయపాటి దుర్గాకుమారి, పాఠశాల డైరెక్టర్లు భాగ్యమ్మ, విశాలాక్ష్మమ్మ,జాతీయ జెండా ఎగురవేశారు.
- నజ్మల్ పబ్లిక్ స్కూల్‌లో హెడ్మాస్టర్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు జెండా వందనం చేసి పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- దారుల్ సలాం ఇస్లామిక్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఖూన్‌కా రిస్తా చారిటబుల్ ట్రస్టుతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. పాఠశాల ప్రాంగణంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ నిసార్‌అహ్మద్, రిజ్వాన్‌షేక్, సిబ్బంది పాల్గొన్నారు.
- అస్తానె బుఖారియా పీఠంలో సంస్థ అధ్యక్షుడు సయ్యద్‌షా మగ్దూం బుఖారిసాహెబ్ ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పీఠాధిపతి హబీబుల్లాబుఖారి సాహెబ్ పాల్గొన్నారు.
- నగర శివారులోని కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు.
- సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ విక్టర్ రాజు, పాస్టర్ సాల్మోన్, డయాసిస్ కార్యదర్శి మనోహర్‌బాబు, ట్రెజరర్ డేనియల్ తదితరులు జాతీయ జెండా ఎగురవేశారు. సిబ్బందితో కలిసి వందన సమర్పణ చేశారు.
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. జాతీయ గీతం ఆలపించి స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకున్నారు. విశిష్టమైన సేవలందించిన సిబ్బంది, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.
- కడప శిల్పారామంలో పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌బాబుజాతీయ జెండా ఎగురవేసి వందనాలు సమర్పించారు. చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.
- స్థానిక రీజనల్ కార్యాలయంలో గణతంత్ర వేడుక ఘనంగా నిర్వహించారు. డీఆర్‌హెచ్ బాషా జెండా వందన చేశారు.
- కడప జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధానన్యాయమూర్తి జి.శ్రీదేవి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. న్యాయమూర్తులు ఎల్. వెంకటేశ్వరరావు, జి.దినబాబు, షేక్.ఇంతియాజ్ అహ్మద్, ఎస్.బాబాఫక్రుద్దీన్, ఎస్.ప్రవీణ్ కుమార్, కె.ప్రత్యూషకుమారి, జె.హేమస్రవంతి పాల్గొన్నారు.
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ జాతీయపతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. అదనపు ఎస్పీలు ప్రకాష్‌బాబు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.
- ఆర్టీసీ జిల్లా రీజనల్ కార్యాలయంలో కడప జోన్ ఈడీ పైడి చంద్రశేఖర్ జెండా వందనం స్వీకరించారు. 60 మందికి ఉత్తమ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలిమేర గోపాల్ రెడ్డి, గజలక్ష్మి, లక్ష్మి భాస్కర్ పాల్గొన్నారు.
- ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్ జెండా వందనం స్వీకరించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి జాతీయ జెండా ఎగురవేసి వందనం స్వీకరించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.
- కడప రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజరు శేఖర్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేసి వందనం స్వీకరించారు.
- కేంద్ర కారాగారం, మహిళా కారాగారంలో పర్యవేక్షణ అధికారి కె.రాజేశ్వరరావు, కృష్ణవేణి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. జైలర్లు, డిప్యూటీ జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
- రిమ్స్ కళాశాలలో ప్రిన్సిపల్ సురేష్ జెండా ఎగురవేసి వందనం చేశారు. డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు



మను పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు



నాగార్జున మోడల్ స్కూల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్‌లో ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపల్ సలీంబాష, తదితరులు



పీఎంశ్రీ స్కూల్లో చిన్నారులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు



ఆస్తానా ఎ బుఖారియాలో జెండా ఎగురవేస్తున్న సంస్థ అధ్యక్షుడు సయ్యద్‌షా మగ్దూం బుఖారిసాహెబ్

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎగిరిన జెండా



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

కడప సెవెన్ రోడ్స్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబుతో కలిసి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎన్నో జాతులు, కులాలు, మతాలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే ప్రజలు సమైక్యతతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



వైవీయూలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

కడప ఎడ్యుకేషన్: దేశ అభివృద్ధిలో యువత భాసగ్వామి కావాలని వైవీయూ ఉప కులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పరేడ్‌లో ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప కులపతి కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేశారు. అనంతరం వీసీ ప్రసంగిస్తూ.. వృత్తిపరమైన, వ్యక్తిగతమైన మన ప్రవర్తన రాజ్యాంగంలో నిర్దేశించిన హక్కులు, బాధ్యతలకు కట్టుబడి ఉండాలన్నారు. క్రమశిక్షణ, కృషి, నైతిక విలువలు యువత ప్రయాణానికి మార్గదర్శకంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, కె.రామసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



రిమ్స్ మెడికల్ కళాశాలలో



కడప ఏడీపీ కార్యాలయంలో

వ్యవసాయ కార్పొరేటీకరణకు నూతన చట్టం



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు కేంద్రం నూతన చట్టాలు తీసుకువచ్చిందని, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బి.మనోహర్, దస్తగిరిరెడ్డి, బాదుల్లా, అన్వేష్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. నూతన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రాత పూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలివేసిందని విమర్శించారు. సహకార చట్టంలో చేసిన మార్పులతో సహకార, పాడి, మత్స్య సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీల గొడుగు క్రిందకు చేర్చడమే లక్ష్యంగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీచేసిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధాన చట్టం ప్రకారం వ్యవసాయాధారిత పరిశ్రమాధిపతులు, ఎగుమతి దిగుమతి దారులు, విదేశీ వ్యాపారులు రైతుల పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం, ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకొనేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీములు ఇకపై ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, రాజమణి, పవన్, దస్తగిరి, రవి, ఉద్దె మదిలేటి, సుబ్బరాయుడు, లింగన్న పాల్గొన్నారు.

పన్ను లేని పరిమితి ఐదు లక్షలకు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీవీ.ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఆదాయపు పన్నులేని పరిమితిని ఐదు లక్షల రూపాయల పెంచాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీవీ.ప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పన్ను నిబంధనలలో మార్పు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సెక్షన్ 80సి కింద పొదుపులో పరిమితిని రూ.3లక్షలకు పెంచాలని విన్నవించారు. గృహ రుణాలపై అనుమతించే వడ్డీ పరిమితిని రూ.3.5లక్షలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీ ఖాన్, ఉమాకాంత్ పద్మజ, వీరప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగికి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న గుండ్లకొండ రవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గణతంత్ర దినోత్సవంలో భాగంగా 2024లో దైనందిన విధులను క్రమశిక్షణ, అంకితభావంతో నిర్వహించిన కానిస్టేబుల్ గుండ్లకొండ రవికి ఏపీఎస్సార్టీసీ కడప జోన్ ఈడీ పైడిచంద్రశేఖర్ ప్రశంసాపత్రం అందజేశారు. డ్యూటీ లేని సమయంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఎంతోమంది అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ, రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ప్రశంసా పత్రం అందజేశామని ఈడీ తెలిపారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలకు తరలిస్తున్న సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివారులోని భాకరాపేట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. మూడు రోజులుగా రిమ్స్ మార్చరీలో ఉన్న మృతదేహానికి అంత్యక్రియలు జరపాలని పోలీసులు మేము సైతం సేవా సంస్థ ప్రతినిధులను సంప్రదించారు. వారు ఆదివారం అంత్యక్రియల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాము, అయ్యవారయ్య, రామలోకం, కిశోర్, రామరాజు, శివరాం, గురవయ్య, నాగేశ్వరరావు, పుల్లయ్య పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని అమలుచేయాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ కో-ఆర్డినేటర్ సత్తార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాగాన్ని పకడ్బందీగా అమలుచేయాలని ఏఐసీసీ కో ఆర్డినేటర్ సత్తార్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో రాజ్యాంగమా.. మను ధర్మమా అంశంపై ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిన్న ప్రాంతాలు, మతాలు, జాతులు, సంస్కృతులు, కులాలు కలిగిన దేశంలో అణచివేయబడిన వర్గాలకు హక్కులు కల్పించేందుకు ఎంతోమంది త్యాగాలు చేశారన్నారు. అందరి ప్రయోజనాలు కాపాడేలా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రాజ్యాంగం తయారయిందన్నారు. అయితే కొందరు మతాలు, కులాలు, ఇతర రూపాలలో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. మారణకాండను ఆపే ప్రయత్నం చేయలేదన్నారు. రాజ్యాంగాన్ని తప్పకుండా అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నజీర్, బండి జకరయ్య, నాసిర్, మైనుద్దీన్, నారాయణరెడ్డి, సీఆర్‌వీ.ప్రసాద్, గురప్ప, బందెల ఓబయ్య పాల్గొన్నారు.

ఉత్తర రామాయణ రచనతో కంకంటికి కీర్తి



వక్తను సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్: ఉత్తర రామాయణ రచనతో కంకంటి పాపరాజుకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు లభించాయని తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తర రామాయణకర్తగా కంకంటి పాపరాజు తెలుగు నాట సుప్రసిద్ధుడన్నారు. ఆయన విష్ణుమాయా విలాసం, యక్షగానం, ఉత్తర రామాయణలను ప్రబంధశైలిలో చంపూ కావ్యంగా రచించాడన్నారు. పాపరాజు పూర్వ రామాయణాన్ని చెప్పలేదనే భావన రాకుండా ఉండడానికి ఆ కథనం తటినీ సంగ్రహంగా 87 పద్యాల్లో చెప్పడం విశేషమన్నారు. సభ ప్రారంభంలో నిన్న స్వర్గస్థులైన బెంగుళూరు విశ్వవిద్యాలయ విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య తంగిరాల సుబ్బారావుకు శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత అతిథులందరూ చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య జి.పార్వతి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, పుత్తా పుల్లారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు, డాక్టర్ జీవీ.సాయిప్రసాద్, కె.వి.రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.